క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు

మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలో సోమవారం వీఎస్టీ సంజీవని, భవిష్య భారత్ భవిష్య భారత్ ప్రాజెక్ట్ మేనేజర్ నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 265 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు శానిటరీ ప్యాడ్ అందజేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హరి ప్రసాద్, డాక్టర్ రమ్య, ఫార్మాసిస్ట్ రమ్య, ల్యాబ్ టెక్నీషియన్ నిరంజన్‌సెట్టి, హాజి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు టెంకాయల వేలం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 13న టెంకాయల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డిలు ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే పాటదారులు ఈనెల 13న ఉదయం 11.30 గంటలకు నిర్దేశిత డిపాజిట్‌ను చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



అలంపూర్: అలంపూర్ పోలీస్ స్టేషన్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఎస్‌ఐ వెంకటస్వామి సోమవారం అందజేశారు. కర్నూల్ జిల్లా దేవమాడ గ్రామానికి చెందిన బోయ మధుకుమార్ పది రోజుల క్రితం అలంపూర్‌లో సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి అందజేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీలు

మానవపాడు: మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 1.4.2023 నుంచి 31.3.2024 వరకు జరిగిన ఉపాధి హామీ ద్వారా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ సోమవారం నుంచి ఆయా గ్రామల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. మొదటి పేజ్ గోకులపాడు, బోరవెల్లి, చంద్రశేఖర్‌నగర్, పెద్దపోతులపాడు, 2వ పేజ్ అమరవాయి, నారాయణపురం, మద్దూరు, కలుకుంట్ల, 3వ పేజ్ పెద్దఆముదాలపాడు, కొర్విపాడు, పల్లెపాడు, చండూరు, మానవపాడు, జల్లాపురం, చెన్నిపాడు గ్రామాలలో సామాజిక తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠ కార్యక్రమం

రాజోళి: మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భ్రమరాంబ సమేత(బ్రహ్మసూత్ర)రామలింగేశ్వర, ధ్వజ, శ్రీకళ్యాణ రామ, ఆంనేయ, నాభి, నవగ్రహ, ప్రతిష్ఠా మహోత్సవాలు చేశారు. . ప్రాతఃకాల పూజలు దీక్షా, మూర్తి హోమాలు, గర్తన్యాసం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



అలంపూర్: పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజు, మాజీ జెడ్పీటీసీ కాశపోగు రాజు జిల్లా కలెక్టర్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. ఉండవెల్లి మండలం పుల్లూరు పంచాయతీ కార్యదర్శిపై సోమవారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఉండవల్లి మండలం పుల్లూరు పరిధిలోని అలంపూర్ చౌరస్తాలో 70 ఎకరాల్లో డీటీసీపీ అప్రూవల్ వెంచర్ వేసినట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం గ్రామ పంచాయతీకి 10 శాతం స్థలం, 15 శాతం ప్లాట్స్ గ్రామ పంచాయతీకి మార్టిగేజ్ చేయాల్సి ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఒకేసారి ఐదు వెంచర్లలలో మార్టిగేజ్ ఫ్లాట్స్ చేశారని వినతిలో పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

గద్వాల అర్బన్: మౌలాన అబుల్ కలాం అజాద్ విద్యాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు చేసిన మహోన్నత వ్యక్తి అని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా కొనియాడారు. దేశ మొదటి విద్యాశాఖ మంత్రి అబ్దుల్ కలాం అజాద్ జయంతిని సోమవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఉపన్యాస, క్విజ్, వ్యాస రచన, ముగ్గుల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాధిక, సురేంద్ రెడ్డి, భాస్కర్, పవన్‌కుమార్, వెంకటేశ్వరమ్మ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం ఆధ్వర్యంలో...

భారత తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఎంఐఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో రాజీవ్‌మార్గ్ రోడ్డులోని ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా మోమిన్ మహెల్లా ఉర్దూ మీడియం స్కూల్‌లో కలాం జయంతి నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఫారుక్ పాష, సైజాద్, రఫీ, జుబేర్, అబ్దుల్ రహీం , ఇమాముద్దీన్, అంజాద్ తదితరులు ఉన్నారు.

ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి..

విద్యార్థులు అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోధించాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భవాని, అధ్యాపకులు, జేఏసీ నాయకులు, అతిఖుర్ రహ్మాన్, మధుసుధన్ బాబు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఉస్మాన్, చాంద్, ఇసాక్, యూనుస్, సాదతుల్లా పాల్గొన్నారు.



ఉండవెల్లిలో గురుకుల పాఠశాలలో ఆజాద్ చిత్రపటానికి నివాలర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



జిల్లా కేంద్రంలో అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



గద్వాలలో ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్: దేశ తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక రాజీవ్‌మార్గ్ రోడ్డులోని అబుల్‌కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అబుల్‌కలాం విగ్రహానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇమాముద్దీన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాషా బహుమతులు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు.

ఉండవెల్లి: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలోని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి, ఎస్‌జీఎఫ్ క్రీడలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు.విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామకృష్ణ, శివ ప్రసాద్, అశోక్, ప్రిన్సిపల్ ఎలిజబిత్ సుహాసిని, స్కూల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సభ్యత్వాల నమోదు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్ రెడ్డి

గద్వాల: ఈనెల 15న బీజేపీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా బూత్ కమిటీ, మండల కమిటీ, జిల్లా కమిటీ క్రియాశీల సభ్యత్వాలు పూర్తి చేయాలని గద్వాల మండల సభ్యత్వాల ఇన్‌చార్జి మిర్జాపూరం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో నిర్వహించిన మండల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి బూత్‌లో బూత్ అధ్యక్షుడు, ఆపై స్థాయి పదవులకు బీజేపీ తరుపున ఎన్నికలు ఉంటాయన్నారు. పోటీకి తప్పనిసరిగా 100 క్రియాశీల సభ్యత్వాలు చేయించాలన్నారు. కార్యక్రమంలో అశోక్ రెడ్డి, మధుసుధన్ రెడ్డి, శ్రీనివాస్, రఘు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ఇటిక్యాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రెవెన్యూ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై జరిగిన దాడికి వ్యతిరేకంగా తహసీల్దార్ నరేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అధికారులపై దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భీమ్‌సేన్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇటిక్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ముమ్మరంగా సమగ్ర సర్వే



కేటీదొడ్డిలో కుల గణన సర్వే పరిశీలిస్తున్న సీఈఓ కాంతమ్మ



అమరవాయిలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు

కేటీదొడ్డి: సమగ్ర కుటుంబ సర్వే ప్రోఫార్మలో ఉన్న అన్ని కాలమ్స్ ఎన్యూమరేటర్లు విధిగా పూరించాలని జిల్లా పరిషత్ సీఈఓ కాంతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణ మోహన్, స్పెషల్ ఆఫీసర్ అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: సమగ్ర కుటుంబ సర్వే మండలంలో జోరుగా కొనసాగుతుంది. సోమవారం మండలంలోని అమరవాయి, పాల్వాయి, బిజ్వారం, తాటికుంట, నాగర్‌దొడ్డి, ఎల్కూరు, మల్దకల్ గ్రామాల్లో కొనసాగిన సర్వేను ఎంపీడీఓ, ఎంపీఓలు పరిశీలించారు. ఎన్యూమరేటర్లు కుటుంబ సభ్యులతో పూర్తి సమాచారం తీసుకుని తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల: తప్పులు లేకుండా సమగ్ర కుటుంబ సర్వే చేయాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, వారి వార్షిక ఆదాయం తదితర వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

రాజోళి: మండలంలో సోమవారం సమగ్ర కుటుంబ సర్వే కొనసాగింది. మండల కేంద్రం రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో జరిగిన ఈ సర్వేలో భాగంగా ఎన్యూమలేటర్లు 738 ఇళ్లలో సర్వే నిర్వహించి నిర్దేశించిన వివరాలు నమోదు చేసినట్లు ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ తెలిపారు.

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు గ్రామాల్లో సోమవారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా కుటుంబ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మూడో రోజు కొనసాగింది. సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు సోమవారం ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేశారు. వల్లూరు, వేములలో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను ప్రత్యేక అధికారి రవికుమార్ (ఎఓ) పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సోషల్ రెస్పాన్స్‌బులిటీ బృంద సభ్యులు

గద్వాల రూరల్: మండలంలోని చెనుగోనిపల్లికి చెందిన వెంకటస్వామి పక్షవాతంతో మంచానికే పరిమితమైయ్యాడు. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్స్‌బులిటీ బృందం సభ్యులు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి చికిత్స నిమిత్తం రూ.40,500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బృంద సభ్యులు అశోక్, మురళీ, సంజీవ్, నాగేష్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణంలో ప్రధాన వీధుల్లో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏఈ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని వివిధ కాలనీల్లో వీధి స్తంభాలకు బల్బులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు చిమ్మ చీకట్లో మగ్గుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణాచారి, లక్ష్మణ్ గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకాలు



పశువులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

శాంతినగర్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు శాంతినగర్ పశు వైద్యశాల డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తిమ్మాజిపల్లిలో సోమవారం పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆవులు, గేదెలు, ఎద్దులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాల పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలోని శ్రీనగర్‌లో లక్ష్మీతులసమ్మకు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జగన్‌మోహన్ నాయుడు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ. 80వేలు చెక్కు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్‌కుమార్ గారి ఆదేశానుసారం చెక్కు అందించామన్నారు. కార్యక్రమంలో చినిబాబు, రాంబాబు, రాజేష్, బాల ప్రభాకర్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అండగా ఉంటా

అలంపూర్: నియోజకవర్గంలోని పేద ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఇటిక్యాల మండలం ఉదడాపురం గ్రామానికి చెందిన కమ్మరి మల్లయ్య ఆచారి శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.4 లక్షల ఎల్‌ఓసీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కలుగోట్ల పీఏఎస్ అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, రఘురెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గద్వాల అర్బన్: గ్రామ స్థాయిల్లో పని చేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ్మా, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాం అంజి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఓఏలకు మూడు నెలకు ఒక్కసారి రెన్యూవల్ పద్ధతి ఉండడంతో వీఓఏలు అభద్రత భావానికి గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వీఓఏల సమస్యలు పరిష్కరించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నిర్వహించనున్న ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వీఓఏలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఓఏల వివిధ మండలాల అధ్యక్షులు తిమ్మప్ప, తిరుమల్, శ్రీనివాసులు, విజయలక్ష్మీ, హైమావతి, పావని తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, వీఓఏలు

పోటీలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి



విజేతలను ప్రకటిస్తున్న ఉపాధ్యాయిలు

అయిజ: ఉపన్యాస పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని ఎంఈఓ రాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సర్వర్ మెదటి బహుమతి గెలుపొందాడు. అదే విధంగా మండలంలోని భూంపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి రాహుల్ ద్వితీయ బహుమతి గెలుపొందాడు. ఎన్‌టీఎస్ఎఫ్ వారు ప్రతి సంవత్సరం ఉపన్యాస పోటీలు, టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించి విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందిపజేస్తున్నారని కొనియాడారు. ప్రతి సంవత్సరం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు శేషఫణి శర్మ, నరసింహులు, రామకృష్ణ, లక్ష్మణ్, మంజువాణి, ప్రభుదాస్, ప్రభ, అమృతమ్మ, వెంకటస్వామి, తిమ్మప్ప, రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడిని సన్మానించిన ఈఓ



పరమేశ్వరుడు, నంది చిత్రాలు వేస్తున్న చిత్రకారుడు పవన్



చిత్రకారుడిని సన్మానిస్తున్న ఆలయ పురేందర్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: కార్తీక మాసంలో ప్రతి సోమవారం భక్తుల చేత కార్తీక దీపాలు అందంగా వెలిగించాలని ఇందుకు అవసరమైన ప్రమిదలు, నూనె, ఒత్తులు దేవస్థానం నుంచి ఉచితంగా అందజేయాలని దేవాదాయశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో గద్వాలకు చెందిర కళాకారుడు పవన్ చేత ఆ లయ ప్రాంగణంలో పరమేశ్వరుడు నంది చిత్రాలు వేయించి వాటి చుట్టూ కార్తీక దీపాలు వెలిగించారు.ఈ సందర్భంగా పవన్‌ను ఈవో పురేందర్‌కుమార్ అభినందించి అమ్మవారి జ్ఞాపిక అందజేశారు.

ధ్వజ స్తంభ ప్రతిష్ఠకు రూ.లక్ష విరాళం

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలోని ఎలమ్మ ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమానికి మాజీ సర్పంచ్ తిరుమల్ రెడ్డి రూ.లక్ష విరాళం అందచేశారు. గురువారం గ్రామంలో ప్రతిష్ఠా కార్యక్రమం జరుగనుండగా ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం లక్ష రూపాయల చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి ఎల్లప్పుడూ సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో వెంకట్రాజ గౌడ్, రామన్ గౌడ్ తదిదరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు చెక్కు అందచేస్తున్న తిరుమల్ రెడ్డి

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేటీదొడ్డిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హనుమంతు

కేటీదొడ్డి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్లా హనుమంతు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉరుకుందు, టీచర్ గోవిందు, యుగందర్, వెంకటేష్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

గట్టు: నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో గట్టులో మండల స్థాయి ఉపన్యాస పోటీలు సోమవారం నిర్వహించారు. గట్టు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి పోటీలకు 8 పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గట్టు ఉన్నత పాఠశాలకు చెందిన పరుశరాముడు మొదటి బహుమతి, బోయలగూడెం పాఠశాలకు చెందిన చిన్నారి ద్వితీయ బహుమతి గెలుచుకుంది. విజేతలకు ఎంఈఓ నల్లారెడ్డి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

శాంతినగర్: కార్తీక సోమవారం పర్వదినం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని శివాలయాలకు ప్రాతఃకాలానే చేరుకున్న భక్తులు మహాదేవునికి అభిషేకాలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన గావించారు. అనంతరం ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు.

బీచుపల్లిలో..

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలో భక్తులు కార్తీక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పవిత్ర కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణానదికి పుష్కరఘాట్ దగ్గర అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక నదీ హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



వడ్డేపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు